# పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

**ధర్మ సమాజ్ పార్టీ రిలే నిరాహార దీక్ష**


ఎమ్మార్వో ఆఫీస్ వద్ద దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

**మేడిపల్లి:** అర్హులైన నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు ఇళ్లు, భూమి అందించి ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ.. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల ఎమ్మార్వో ఆఫీస్ వద్ద సోమవారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల కన్వీనర్ పారునంది వెంకేర్ మాట్లాడుతూ.. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారదన్ మహారాజ్ పిలుపు మేరకు రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనాభాలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక అసమానతలు తొలగి బలపడతారన్నారు. ఈ ఐదు డిమాండ్లను సామాన్యులకు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆమరణదీక్షకు సైతం దిగుతామని హెచ్చరించారు. ధర్మ సమాజ్ పార్టీ మేడిపల్లి మండల కో- కన్వీనర్ ఆడాల కుమార్, మండల సభ్యులు కళ్లేపల్లి మోహన్, మేడ్చల్ జిల్లా కో- కన్వీనర్ శివకుమార్, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్‌కు బెదిరింపులు !

**డీసీకి ఫిర్యాదు చేసిన వైనం**


డీసీ జగన్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు

**కాప్రా:** జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఈ సూరజ్ తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని సివిల్ కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు ఆరోపించారు. దీనిపై సోమవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని విషయంలో తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అడిగితే నోటికొచ్చినట్లు దుషిస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయంపై సర్కిల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా తనలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. సరైన విచారణ చేపట్టి తక్షణమే ఏఈపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రైల్వేట్రాక్ పక్కన వ్యర్థాల తొలగింపు


వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీతారాముయాదవ్

**గౌతంనగర్:** గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో రైల్వేట్రాక్ ఇరువైపుల ఉన్న చెత్త, చెదారం, చెట్లకొమ్మల తొలగింపు పనులను సోమవారం కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, రైల్వే అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరానెహ్రూనగర్‌లో ఉన్న రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి క్రిమికీటకాలకు అడ్డాగా మారిందన్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వ్యర్థాలు, చెట్లకొమ్మలను తొలగింపజేశారు. ఏఎంహెచ్ఓ మంజుల, రైల్వే అధికారులు మల్లికార్జున్, స్థానిక నేతలు మేకల రాముయాదవ్, పారిశుద్ధ్య జవాన్ అలీ, రైల్వే అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించలేదని..

- విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని వైనం
- స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**రామంతాపూర్:** గణేష్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హైస్కూల్ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించలేదని హాల్‌టికెట్లు నిరాకరించి పరీక్షలకు అనుమతించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమ పిల్లలను స్కూల్ బిల్డింగ్ పైకి యాజమాన్యం తరలించిందని, విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ విషయాన్ని ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు దృష్టికి తీసుకెళ్లామని, ఈ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు నాగమణి, మహేష్, శ్రీనివాస్, రాధిక, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు



ప్రత్యేక పారిశుద్ధ్యంలో కార్పొరేటర్ వెంకటేష్‌యాదవ్

**బోడుప్పల్:** పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం వాసవీనగర్ కాలనీలో నిర్వహించిన పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డివిజన్ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు వివరించారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిచ్చినట్లు పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, వాసవీనగర్ కాలనీ అధ్యక్షులు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు సహోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శివయాదవ్ తదితరులున్నారు.

# టీ స్టాల్ వచ్చే.. టాయిలెట్ పాయే !


చిలుకానగర్ చౌరస్తాలో నిరుపయోగంగా షీ టాయిలెట్స్

**ఉప్పల్ :** మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పలుచోట్ల షీ టాయిలెట్స్‌ను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. నాలుగేళ్ల క్రితం చిలుకానగర్ నుంచి నాచారం వెళ్లే మార్గం ఫుట్‌పాత్‌పై షీ టాయిలెట్‌ను ఏర్పాటు చేయగా.. నిర్వహణ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించారు. మొదట టీ స్టాల్ ఏర్పాటుకు అనుమతినివ్వగా.. క్రమేణ టాయిలెట్ కనుమరుగై, టీస్టాల్‌ను మాత్రమే నడుస్తోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అక్కడి మహిళలు వాపోతున్నారు. పారిశ్రామికవాడలు దగ్గర ఉండటంతో రోజూ మహిళా కార్మికులు, ఉద్యోగస్తులు, బస్సులు, ఆటోల కోసం వేచి ఉండేవారి కోసం జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకుని తిరిగి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

# ప్రజావాణికి అధికారులు రావాలి

- సమన్వయంతో పనిచేస్తేనే సమస్యల పరిష్కారం
- అన్ని విభాగాలు హాజరుకావాలని పలువురి సూచన


ప్రజావాణిలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

**మల్కాజిగిరి:** మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో అన్ని విభాగాల అధికారులు పాల్గొనాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో జలమండలి, విద్యుత్, ఆరోగ్య విభాగం అధికారులు పాల్గొనడం లేదని దీని వల్ల ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఆయన ప్రశ్నించారు.

**సమన్వయలోపం..**

జలమండలి విభాగం, జీహెచ్ఎంసీ విభాగానికి యూజీడీ నిర్వహణలో సమన్వయం ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో కాలనీలు, గ్రీన్‌వేస్ట్, డ్రైనేజీ, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు లాంటి అనేక సమస్యలు అలాగే ఉండిపోతున్నాయన్నారు.

**బాధ్యతగా విధుల నిర్వహణ..**

సర్కిల్ డీసీ అన్ని విభాగాల అధికారులు ప్రజావాణిలో పాల్గొనేలా బాధ్యత తీసుకోవాలన్నారు. గృహలక్ష్మి, ఉచిత విద్యుత్, పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నా.. అమలుకాని వారికి న్యాయం చేయాలని కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలసరస్వతీనగర్‌లోని రోడ్డు కబ్జాపై కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

**ఓటర్ల నమోదు ప్రక్రియపై ఫిర్యాదు**



వినతిపత్రం అందజేస్తున్న కుమ్మరి రాజు

నియోజకవర్గంలో ఓటర్ల నమోదు పక్రియ బోగస్‌గా మారిందని, చనిపోయిన వారికి ఓట్లు ఉన్నాయని, బ్రతికి ఉన్న వారికి లేవని ఓటర్ల నమోదు కార్యక్రమం సక్రమంగా జరగడం లేదని వివేకానంద రైజింగ్ సొసైటీ అధ్యక్షుడు కుమ్మరి రాజు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

## సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా లక్ష్మణ్



**మల్కాజిగిరి:** సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యుడిగా మల్కాజిగిరికి చెందిన గుంటి లక్ష్మణ్ ఎంపిక య్యారు. ప్రస్తుతం ఆయన మల్కాజిగిరి మండల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తనవంతు పోరాటం చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

## స్కైవాక్ నుంచి దూకేసి..

**స్వల్పగాయాలతో బయటపడిన వ్యక్తి**

**ఉప్పల్:** ఉప్పల్ స్కైవాక్ వంతెనపై నుంచి ఓ వ్యక్తి దూకేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సంగారెడ్డి భవానీనగర్ ప్రాంతానికి చెందిన ఎస్ఏ ఫ్రాన్సిస్ (34)స్కైవాక్ ఎక్కి ఉప్పల్ మెట్రోస్టేషన్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా కిందకు దూకేశాడు. అదృష్టవశాత్తు అతడు ట్రాఫిక్ బూత్ గొడుగుపై పడి అక్కడి నుంచి కిందకు జారడంతో కాలికి గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని ఉప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సదరు వ్యక్తికి మతిస్థిమితం సరిగ్గా లేనట్లుగా వ్యవహరిస్తున్నాడని పోలీసులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తా..


ప్రార్థనలో ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

**మల్లాపూర్:** క్రైస్తవుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ బేతస్థ హౌస్ ఆఫ్ ప్రేయర్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ గొస్పెల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాస్టర్లు ఎబినేజర్, బీదర్ దేవదాసు, జాషువా, స్థానిక నేతలు పీఆర్, ప్రవీణ్, శ్రీనివాస్‌రావు, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కత్తిరించారు.. వదిలేశారు



కత్తిరించి వదిలేసిన చెట్లకొమ్మలు

**రామంతాపూర్ :** రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో గత నెలలో ప్రతిరోజు 4-5 గంటలు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. అనంతరం అంతర్గతరోడ్ల పక్కన ఉన్న విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించి రోడ్డుపైనే వదిలేశారు. దీంతో ఈ రోడ్డు ద్వారా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ డీసీ, విద్యుత్ అధికారులకు కూడా సమాధానం అందించిన పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వ్యర్థాలను తొలగించకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. లావణ్య, రామంతాపూర్, ఏఈ 9440813177.

## కూలిన తాటి చెట్టు.. తప్పిన ప్రమాదం


తాటిచెట్టును తొలగిస్తున్న డిజాస్టర్ సిబ్బంది

**మల్లాపూర్:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకి రోడ్డు మధ్యలో ఉన్న తాటి చెట్టు ఒక్కసారిగా విరిగి పడింది. ఆ చెట్టు కూలిన సమయంలో అటువైపు ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. జీహెచ్ఎంసీ, అర్బన్ డిజాస్టర్ ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి రోడ్డుపై పడిన తాటి చెట్టును తొలగించారు. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, డిజాస్టర్, జీహెచ్ఎంసీ,విద్యుత్ అధికారులకు కాలనీవాసులు, పద్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఫస్ట్‌ఎయిడ్ సేవలకు మాత్రమే పరిమితం కావాలి



**సాక్షి,సిటీబ్యూరో:** ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సేవలకు మాత్రమే తమ క్లినిక్‌లను ఆర్ఎంపీలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. రఘునాథ్‌స్వామి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయం హాలులో జిల్లా గ్రామీణ వైద్య ప్రాక్టిషనర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. యాంటీబయోటిక్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ వంటి మందులు ఇచ్చే అనుమతి లేదని స్పష్టం చేశారు. తమ క్లినిక్‌లను 'ఫస్ట్ ఎయిడ్ క్లినిక్స్' అనే బోర్డులతో అమర్చాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన నకిలీ వైద్యులపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ వైద్య కమిషన్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే తనిఖీల్లో పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోతే క్లినిక్‌లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే.. జిల్లా ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఆర్ఎంపీలపై అవసరమైతే చట్టరీత్యా కేసు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చూస్తామని హెచ్చరించారు.

## చికిత్స పొందుతూ.. యువకుడి మృతి

**ఘట్‌కేసర్:** రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాల్ గ్రామానికి చెందిన తంబాల నవీన్‌యాదవ్ (25) నగరంలో ఓ ప్రైవేటు ఉద్యోగి. గత నెల 30న రాత్రి నవీన్‌యాదవ్ తన స్నేహితుడు మెరుగు సాయిచరణ్‌తో కలిసి తన బైక్ (టీఎస్ 30జీ-7942)పై ఘట్‌కేసర్ నుంచి ఇంటికి వెళ్తుండగా.. ఎదులాబాద్ రోడ్డులోని అండర్‌పాస్ వద్ద (టీఎస్ 08 హెచ్‌హెచ్ 1409 నెంబర్) కారు బైకును అతివేగంగా ఢీకొట్టింది. దీంతో నవీన్‌యాదవ్ తల ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో నవీన్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అభినందన


సత్యవేణిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి:** ప్రతిభ ఉంటే ఏదైనా సాధించవచ్చని మల్కాజిగిరి ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన సత్యవేణి నిరూపించారు. చిన్నతనంలోనే దివ్యాంగురాలైన ఆమె గ్రూప్-4 లో అర్హత సాధించి జిల్లాలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. సోమవారం ఆమెతో పాటు ఆమె తండ్రి ఉమామహేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సన్మానించి అభినందించారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, బ్రహ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన

**గౌతంనగర్:** గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ రాజాశ్రీనివాస్‌నగర్‌లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, పీవీ.సత్యనారాయణ, వెంకట్, శ్రీకాంత్, సాయి, నవీన్, విఘ్నేష్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి పల్లకి సేవ


స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

**అల్వాల్:** ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి తిరుకల్యాణం ఉంటుందని, భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించాలని నిర్వాహకులు కోరారు. ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, సామాజిక సేవకులు శివరామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, రాము, మాణిక్యరెడ్డి, అర్చకులు రఘు, రమణ, రాజు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



**మల్కాజిగిరి:** వసంతపురికాలనీలో జగదీష్‌చారి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా జరిగింది. ఆనంద్‌చారి గురుస్వామి మహాపడిపూజ నిర్వహించారు. పడిపూజ అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. నరసింహాచారిస్వామి, విశ్వనాథ్ గుప్తా, కనకాల శ్యామ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు ఏకగ్రీవం



**కుషాయిగూడ:** సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా కాప్రాకు చెందిన జి. శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కుత్బుల్లాపూర్‌లో జరిగిన సీపీఎం మూడో మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. పార్టీ తన సేవలను గుర్తించి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.